# పెళ్ళాంతో పెళ్ళికి...

-భమిడిపల్లి విజయలక్ష్మి

"పిన్ని వచ్చిందమ్మా! అత్త వచ్చిందమ్మా'' అనే పిల్లల కేకలతో పెళ్లి పందిరి దద్దరిల్లిపోతుంటే రిక్షాలోంచి భర్తతో క్రిందకు దిగింది శశిరేఖ.

పందిట్లో కుర్చీలని ఆక్రమించుకుని మగవాళ్ళు పేకాటలో మునిగిపోయి కొంతమంది, సిగరెట్లు కాలుస్తూ రాజకీయాలు చర్చిస్తూ కొంత మంది, ఎన్నికల జయాపజయాలమీద హోరాహోరీ వాగ్వివాదం చేస్తూ మరి కొంతమందితో పెళ్లిపందిరి కోలాహలంగా ఉంది.

శశిని చూసి "మీ ఆయన్ని కూడా లాక్కొచ్చావు. మంచి పని చేసావు'' అంటూ కొందరు అభినందిస్తుంటే, అదేదో పెద్ద జోక్‌లా పగలబడి నవ్వుతున్నారు మరికొందరు. పేకాటరాయుళ్ళు శశివైపు చిరునవ్వు విసిరి మళ్లీ ఆటలో నిమగ్నమయ్యారు.

ఇంతలో శశి అక్కయ్య, పెళ్లికూతురి తల్లి లోపలినుండి వచ్చి సాదరంగా ఆహ్వానించి వారిని లోపల గదిలో కూర్చోబెట్టింది.

"రజనీ! బాబాయికి నీళ్లిచ్చిరా' అంటూ వెళ్లిపోయారు ఇద్దరూ.

అక్కడే ఉన్న పడక కుర్చీలో నడుం వాల్చి కళ్ళు మూసుకున్న ప్రసాద్‌కి మాటలు వినిపిస్తున్నాయి.

"శశీ, మొగుడూ వచ్చారు పెద్దమ్మా'' గొంతు ఎవరిదో మరి.

"అయితే నీ కూతురి పెళ్లికి వాన అన్నమాట, శశి మొగుడు ఇల్లు కదిలి వచ్చాడంటే'' మరొక ముసలమ్మ గొంతు నవ్వుతోపాటు.

"శశీ! నువ్వు ఇంత ఉండేదానివి నా పెళ్లినాటికి. పొట్టి పరికిణీ, రెండు జడల తోకలతో, నేను మొట్టికాయలు వేసేవాడిని. చాలా ఎదిగిపోయావు. ఇప్పుడు నీ తల అందేనా?'' శశిని అడుగుతున్నారెవరో.

"పో బావా! నేను చిన్నప్పటి శశిననుకున్నావా నీ చేత దెబ్బలు తినడానికి? నన్ను కొట్టావంటే మా ఆయనతో చెబుతానంతే'' గారంగా శశి అంటుంటే అంతటా నవ్వుల జల్లులు విరిసాయి.

"శశీ! మీ ఆయనకు మాటలు వచ్చునా?'' ఒక ఆడపిల్ల ప్రశ్న.

"మీ అక్క మాట్లాడనిస్తేగా? మా తమ్ముడు నోరు విప్పే అవకాశమేది?'' అంటూ శశి వదిన ప్రసాద్‌ని సమర్థిస్తోంది.

"ఏయ్ మరదలుపిల్లా! మా తమ్ముడిని కొంగున కట్టుకు వచ్చావా? దారిలో అమ్మేసావా'' శశి బావగారి గొంతు ఖంగుమంటోంది.

"మీ తమ్ముడు ఆడదానిలా గదిలో కూర్చున్నాడు. చూసిరండి''

"మీరంతా ఏకమైతే అతడేం చేస్తాడు మరి'' అంటూ ఆ పెద్దమనిషి గదిలోకి వచ్చి "వచ్చావా నాయనా! చాలా సంతోషం'' అంటూ మరో మాటకు అవకాశమివ్వకుండా "ప్రసాద్‌కి కాఫీ, టిఫిను ఇవ్వండర్రా'' అని ఆర్డరు జారీ చేస్తూ వంటగదివైపు వెళ్లిపోయాడు.

'అమ్మయ్య ఇప్పటికి ఒక ప్రాణికి నాకు కాఫీ ఇవ్వాలనే ఆలోచన వచ్చింది. థాంక్‌గాడ్' అనుకుంటూ కాఫీ కోసం ఆశగా గుమ్మంవైపు చూస్తున్నాడు ప్రసాద్. ఆ ఇంట్లో ఉండే వాళ్ళు ఒక్కొక్కళ్లే 'శశి మొగుడు...శశి మొగుడు' అని గుసగుసలాడుతూ గది లోపలికి తొంగి చూసి పోతున్నారు.

ప్రసాద్ కళ్ళు తెరిచే ఉన్నాడని తోచినవాళ్ళు "వచ్చావా... స్నానం చేసిరా భోజనం చేద్దువుగానీ'' అంటూ పలకరిస్తున్నారు.

'అయ్యో పెట్రోలు లేనిదే బండి నడవనట్లే కాఫీ పోయందే స్నానానికి వెళ్లడానికి ఓపికేది?' అనుకుంటూ 'ఇందాకటి పెద్దమనిషి కాఫీ పంపుతాడేమో' ఆశ చావక కళ్ళు మూసుకున్నాడు.

మళ్లీ బయట మాటల సందడి, కోలాహలం.

"శశీ! మీ ఆయన నలుగురిలో కలవడేమిటే?''

"అదేం కాదులే మామయ్యా. ఇక్కడంతా కొత్త కదా''

"కొత్త వాళ్లని చూస్తే భయమేమిటే అతనికి'' పెద్దగా నవ్వులు ప్రతిధ్వనించాయి.

ప్రసాద్‌కి చాలా కోపమొచ్చింది.

వచ్చినప్పటినుంచి 'శశి మొగుడు..శశి మొగుడు' ఇదే మాట. తనకి పేరు లేదా? వ్యక్తిత్వం లేదా? ఎంతసేపూ ఆమెతో వేళాకోళాలు, పకపకలే గానీ తన దగ్గరకు వచ్చి ఒక్కరైనా పలకరించారా? ఛ... పెళ్లాంతో పెళ్లికి రావడం నాదే తప్పు...

బజారునుండి సరుకులు మోసుకొచ్చిన శర్మ "అక్కయ్యా బాగున్నావా? బావగారు వచ్చారా?'' అంటూ గదిలోకి వచ్చి "నమస్తే బావగారూ. ప్రయాణం బాగా జరిగిందా? అలా నీరసంగా కనిపిస్తున్నారేమిటి?'' అని పరామర్శించి కాఫీ తెచ్చి ఇచ్చి ఎవరో పిలుస్తుంటే బయటకి వెళ్లిపోయాడు.

గది బయట నుండి కిలకిలలు, పకపకలు, హాస్యాలు...గుండెల్లో మండిపోతుంటే కాఫీ తాగకుండా నిరశన ప్రదర్శిద్దామా అని ఆలోచిస్తుండగా శశివచ్చి నిష్ఠూరంగా "ఇంకా కాఫీ తాగలేదా?'' అంటూ మూతి మూడువంకర్లు తిప్పింది.

ఇంక కోపం ఆగలేదు ప్రసాద్‌కి.

"నేను గంటనగా వస్తే ఉన్నానో, చచ్చానో చూసావా? కాఫీ లేకుండా బ్రతకలేనని తెలుసు కదా. నా మొహాన కాఫీ పోసావా? అయినా నీకెక్కడ తీరుతుంది? మీ బావలు, మామలు, వదినల పరిహాసాలు... హాస్యాలు... మీ తమ్ముడి ధర్మమా అని ఇప్పుడే కాఫీ వచ్చింది. నీతో ఈ పెళ్లికి రావడం నాదే తప్పు'' అని కొంచెం గొంతు పెంచి ఏదో అనబోతుంటే ఎవరో గదిలోకి చూసి పరుగెత్తారు.

శశి సిగ్గుతో "చాల్లెండి నలుగురూ వింటే నవ్వుతారు'' అని చకచకా బయటకి వెళ్లిపోయింది.

ఇంతకుముందు చూసి వెళ్లింది ఎవరోగానీ 'శశి మొగుడికి కోపమొచ్చిందనీ, భార్యని నానా మాటలు అంటున్నాడనీ, శశి గుడ్ల నీరు కుక్కుకుంటూ నిలబడిందనే' వార్త చిలవలు, పలవలతో పెళ్లి పందిరంతా దావానలంలా వ్యాపించి గుప్పుమంది. చిన్నాపెద్దా స్త్రీపురుషుల వివక్షత లేకుండా ఒక్కొక్కరే గది గుమ్మంలోకి వచ్చి ఏదో వింత మృగాన్ని చూసినట్లు ప్రసాద్‌ని చూసి వెళ్తున్నారు.

"మీ ఆయనకి కామన్‌సెన్స్ లేదేమిటే శశీ! తాను నలుగురితో కలవడు, నీవు మాతో మాట్లాడుతున్నావని తిడుతున్నాడట? నిన్ను ఎగరేసుకుపోతామనుకున్నాడా? కొరుక్కుని తినేస్తామనుకున్నాడా?''

ఎవరెవరి మాటలో ప్రసాద్ చెవులకు ములుకుల్లా తాకాయి. ప్రసాద్‌కి అలాంటి మాటలు అనడం, వినడం అలవాటులేదు. అతనికి నిజంగానే తల నొప్పి వచ్చింది.

★★★

"భోజనానికి లేవండి బావగారూ'' అంటూ

వచ్చిన శర్మ మాటలకు ఉలిక్కిపడి లేచాడు.

"నాకు తలనొప్పిగా వుంది. మీరంతా భోజనాలు చేయండి. మాత్ర వేసుకుని కొంచెం కాఫీ తాగుతాను'' అన్నాడు మొహమాటంగా. ఆ పల్లెటూరిలో కాఫీ హోటల్ ఉందో లేదో! జేబులో పర్సులేదు. ఆ మహారాణిగారి దగ్గర ఉండిపోయింది. ఏం చేస్తోందో? అని తిట్టుకుంటుంటే శశి కాఫీ కప్పుతో వచ్చింది.

"మీరు నిద్రపోయారు లేపడం ఎందుకని ఊరుకున్నాను. సరే మీరు అన్నం తినరని శర్మ చెప్పాడు. మావాళ్లంతా మీకు కోపం వచ్చిందని, అందుకే భోజనానికి రాలేదని చెప్పుకుంటున్నారు. ఈ ఒక్కరోజు నా మర్యాద దక్కించండి. పెళ్లి అవగానే వెళ్లిపోదాం'' అంటూ కాఫీ కప్పు అక్కడ పెట్టి వెళ్లిపోయింది.

'నేను రాక్షసుడిలా కనబడుతున్నానా అందరికీ. అందరిలో తనని తిట్టానా? కొట్టానా? ఏమిటీ అపనింద. వీళ్లంతా సరదా అయినవాళ్లు... రమ్మని చంపితేనే నేను బయలుదేరానుకదా. ఆ సరదాలు, ఆ కబుర్లు శశి వరకే పరిమితం అని తెలుసుకోలేకపోయాను. నేను రావడం నాదే బుద్ధితక్కువ' అనుకున్నాడు ప్రసాద్.

ఏదైనా అవసరమొస్తే ఏ పిల్లలనో బ్రతిమాలి కబురు పంపితే ఆ మహారాణి వచ్చి వెళ్లేది ముభావంగా. అలా గోదావరిగట్టు, పొలంగట్టు తిరిగి తిరిగి వచ్చాడు. పెళ్లయి రెండేళ్లయినా ఇలాంటి అనుభవం ఇదే తొలిసారి ప్రసాద్‌కి. తనకీ, శశికి మధ్య పెద్ద అగాధం ఏర్పడింది ఆ ఒక్కరోజులో.

★★★

ఆ రాత్రి వదినగారి అమ్మాయి పెళ్లయింది.

మర్నాడు తెల్లవారగానే రిక్షా పిలిచి తను సూట్‌కేసు పట్టుకుని రెడీ అయి అంతఃపురంలో రాణిగారికి కబురుపెట్టాడు. పని హడావుడిలోవున్న శశి పరుగెత్తుకొచ్చి కళ్లు వెడల్పు చేసుకుని చూసింది. భర్త కళ్లల్లోని దృఢ నిశ్చయాన్ని గమనించి తల్లితో, అక్కతో చెప్పి వచ్చింది.

'ఈ పూటకి ఉండమని' ఎందరు చెప్పినా 'నాకు అర్జంటు పనులున్నాయండీ' అంటూ వాచీ వంక అసహనంగా చూస్తూ నిలుచున్నాడు.

శశి కళ్లనీళ్లతో వీడ్కోలు చెబుతోంది.

"తనకి పని వుంటే తను వెళ్లవచ్చుగా? శశిని లాక్కుపోతున్నాడు. వట్టి మూర్ఖుడు''

"ఏం చేస్తాం. నలుగురితో సరదాగా గడపాలనుకుంది. కుదరలేదు. పాపం అదేం చేస్తుంది? శశి సరదా మనిషి, దానికి అలాంటి మొగుడు''

ఇలా సాగిపోతున్నాయి విసుర్లు, వ్యాఖ్యానాలు. ప్రసాద్ ఇక వినలేక రిక్షా ఎక్కాడు.

"అందుకే మొగుడితో పెళ్లికి, పిల్లలతో తీర్థాలకి వెళ్లకూడదన్నారు'' ఒక ముసలమ్మ దీర్ఘాలు తీస్తూ సామెత చెబుతోంది.

ఇంక నవ్వులు ఆగిపోయి వాతావరణం విషాదంగా మారింది. ప్రశాంతంగా కన్నీళ్లతో శశిని సాగనంపారు.

శశి కళ్ళు తుడుచుకుంటూ రిక్షా ఎక్కి కూర్చుని చేయి ఊపుతోంది.

శశి ఆడది. ఆమె కన్నీళ్లతో సానుభూతి సంపాదించుకోగలదు. మరి తను? నిన్నటి నుండి ఒంటరితనం, కడుపుమంట ఎవరితో చెప్పుకుని ఏడవగలడు?

రిక్షా కదిలింది.

'ఛ... పెళ్లాంతో పెళ్లికి వెళ్లకూడదు' వందోసారి పైకే అనేసాడు ధైర్యంగా.

గుండె తేలికపడింది. రిక్షాతోపాటుగా పరుగులు తీసింది.

★

